# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 13-09-2024 | సంపుటి : 06 | సంచిక : 355 | పేజీలు : 8 | వెల : రూ 3-00







## సీఎం చంద్రబాబుతో కేంద్రబృందం భేటీ

అమరావతి,సెప్టెంబర్12 ): ఏపీలో వరద నష్టం అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందం సచివాలయానికి చేరుకుని సీఎం చంద్రబాబుతో భేటీ అయింది. రెండ్రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించింది. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని వరద ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించింది. వరద నష్టంపై చేపడుతోన్న ఎన్యూమరేషన్ గురించి సీఎంకు వివరించింది. ప్రాథమికంగా రూ.6,882 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపింది. ఏపీలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఎం చంద్రబాబు కేంద్ర బృందాలను కోరారు. పంట నష్టంతో పాటు భారీగా ఆస్తి నష్టం జరిగిందనే విషయాన్ని కేంద్ర బృందాలకు సీఎం వివరించారు.


## సీజేఐ ఇంట గణేష్ పూజలో పాల్గొన్న ప్రధాని మోదీ..



న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డి.వై చంద్రచూడ్ నివాసంలో నిర్వహించిన గణేష్ పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. చీఫ్ జస్టిస్, ఆయన భార్య కల్పనా దాస్‌తో కలిసి ప్రధాని మోదీ గణనాధుడికి ప్రత్యేక పూజలు చేశారు.ఇక తమ నివాసానికి విచ్చేసిన ప్రధాని మోదీని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, ఆయన సతీమణీ కల్పనా దాస్ సాదరంగా స్వాగతం పలికారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మహారాష్ట్ర సంప్రదాయం ఉట్టిపడేలా టోపీ ధరించి పూజలో పాల్గొన్నారు ప్రధాని మోదీ. గణేషుడికి హారతి ఇచ్చే ఫోటోలను ప్రధాని మోదీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.సీజేఐ చంద్రచూడ్ మహారాష్ట్రకు చెందినవారని తెలిసిందే. మహారాష్ట్రలో గణేష్ చతుర్థి అతి ముఖ్యమైన పండుగ. ముంబైలో జన్మించిన చంద్రచూడ్ తన బాల్యాన్ని మహారాష్ట్రలోని గడిపారు. ముంబై విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేసిన చంద్రచూడ్.. ఆ తర్వాత హార్వర్డ్ లా స్కూల్‌లో తదుపరి విద్యను అభ్యసించాడు. ఒఒః, ఒఒఓ డిగ్రీలలో పట్టా సాధించాడు. ఇక ఆయన న్యాయవాద వృత్తి ముంబైలో ప్రారంభమైంది.

అక్కడ ఆయన మొదట ముంబై హైకోర్టులో న్యాయవాదిగా తన కెరీర్ ప్రారంభించారు.

## ఆహారశుద్ధి యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలు



చిన్నతరహా పరిశ్రమలపై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,సెప్టెంబర్12:ఏపీలో ఆహారశుద్ధి యూనిట్‌ల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. రైతులను ప్రోత్సహించేలా వీటిని ఏర్పాటు చేస్తామని అన్నారు.సచివాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ, ఆహారశుద్ధి పరిశ్రమలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉపాధి కల్పనలో కీలకమైన ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటికి చేయూత ఇస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే ఈ రంగం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఎం అన్నారు. సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన పూర్తి సౌకర్యాలు కల్పించి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామన్నారు. భూములు కలిగిన రైతులు, ప్రైవేటు భాగస్వామ్యంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం పార్క్‌లు ఏర్పాటు చేసుకునే విధానాన్ని అమల్లోకి తేవాలని సూచించారు. రాజధానిలో రైతుల భాగస్వామ్యంతో వారికి ఎలా లబ్ధి చేకూర్చామో అదే తరహా విధానాన్ని ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటులోను అవలంభించాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు క్లస్టర్లను పూర్తి చేయాలన్నారు. ఎంఎస్ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీ కింద రూ.100 కోట్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు.

## ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటు : పవన్ కల్యాణ్



అమరావతి : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పేద, కార్మిక వర్గాలకు తీరని లోటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీజేఐ ఎన్వీ రమణ, మంత్రి నారా లోకేష్ అన్నారు. వామపక్ష యోధుడు సీతారాం ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని , ఆయన ప్రతీ అడుగు పేదలు, పీడితులు, కార్మికుల పక్షాన వేశారని తెలిపారు.ఎమర్జెన్సీ సమయంలో హక్కుల కోసం బలంగా పోరాడాడని గుర్తు చేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నో ప్రజా సమస్యలను సభ ముందుకు తీసుకొచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఏచూరి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఏచూరి మరణం తీవ్ర విషాదం నింపిందని లోకేష్ పేర్కొన్నారు. ప్రజాపోరాట యోధుడిని కోల్పోయామని వెల్లడించారు. ఏచూరి అవిశ్రాంత పోరాట యోధుడని, ప్రజల కోసం రాజీలేని పోరాటం చేశారని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. ప్రతిపక్షాల ఐక్యతకు కృషి చేసిన జాతీయ నాయకుడు ఏచూరి అని పేర్కొన్నారు.

## సెప్టెంబరు 17వ తేది నుంచి అక్టోబరు 2వ తేది వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయండి.

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు సెప్టెంబర్ 12:- సెప్టెంబరు 17వ తేది నుంచి అక్టోబరు 2వ తేది వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో రోజువారీగా నిర్వహించే కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సెప్టెంబరు 17వ తేది నుంచి అక్టోబరు 2వ తేది వరకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమానికి సంబంధించి సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగే స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని అందుకు గాను ప్రతిరోజు ఒక కార్యక్రమం జరిగేలా ప్రణాళికను శుక్రవారం సాయంత్రం నాటికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో ర్యాలీ, సంస్కృతిక కార్యక్రమాలు, ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛతకి భాగి దారిలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో, ప్రతి ఇంటి నందు వారి డంప్ యార్డులను, చెత్త దిబ్బలను తొలగించేలా ఒకరోజు కార్యక్రమం, మున్సిపల్ వారు నగరాలలోనూ, మున్సిపాలిటీలలోనూ జిల్లా పంచాయతీ అధికారి మరియు మున్సిపల్ కమిషనర్లు కలిసి ప్రణాళిక బద్ధంగా ఒకరోజు డ్రైనేజీ క్లీనింగ్, స్ప్రేయింగ్, ఒకరోజు ర్యాలీ నిర్వహించాలని, ఒకరోజు సఫాయి కర్మచారి, పారిశుద్ధ్య కార్మికులను ప్రోత్సహించేలా ప్రశంసా పత్రాలను, నగదు బహుమతులను తో ప్రోత్సహించాలని, పారిశుధ్య కార్మికులకు శాలరీ పెండింగ్ లేకుండా చూడాలని, గ్రామాలలో ఎక్కడ ఎక్కువ చేత్త పడుతుందో అక్కడ శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని, ఈ కార్యక్రమాలలో గ్రామస్తులను, స్వచ్ఛంద సంస్థలైన రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ భాగస్వాములు చేసుకొని కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

## మంకీపాక్స్ విజృంభణతో రాష్ట్ర సర్కార్ అలర్ట్..



ప్రపంచ దేశాల్ని వణికిస్తున్న మరో మహమ్మారి.. దీన్ని మహమ్మారి అనొచ్చా..? లేక మామూలు వ్యాధిగానే పరిగణించాలా అనే స్పష్టతైతే లేదు. ఇది విజృంభించే పరిస్థితులున్నాయా లేదా అనే సందేహాలు కూడా లేకపోలేదు.ప్రస్తుతానికి ఆఫ్రికా, యూరోపియన్ దేశాల్ని కబళిస్తోంది మంకీపాక్స్. భారత్‌లో ఈ వైరస్ ప్రభావితం చేసేంత సత్తా దీనికి ఉందా లేదా..? అన్నదీ ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య యంత్రాంగం అప్రమత్తమైంది.మంకీపాక్స్? ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో మొదటిసారిగా కనిపించింది. తర్వాత యూరోపియన్ దేశాలకు పాకింది. పాకిస్తాన్‌లో కూడా కొన్ని కేసులు నమోదయ్యాయి. మార్చి మూడో వారంలో మన దేశంలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆరు నెలల గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు ఇండియాని వణికిస్తోంది. మంకీపాక్స్ లక్షణాల్ని, దాంతో కలిగే డ్యామేజ్‌నీ బట్టి కోవిడ్‌తో పోలిక పెట్టడం అలవాటుగా మారింది. కానీ.. కరోనా అంతటి ప్రమాదకరం కాదని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.ఇటీవలే హర్యానాలో ఒక యువకుడికి లక్షణాలుంటే మంకీపాక్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఢిల్లీలో మరో ఇద్దరికి మంకీపాక్స్ సంకేతాలున్నట్టు గ్రహించి.. వీళ్లను ఐసొలేషన్‌లో ఉంచారు. పరీక్షల తర్వాత ఇది వెస్ట్-ఆఫ్రికన్ క్లేడ్-2 మంకీపాక్స్ వైరస్‌గా గుర్తించినట్టు కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల ప్రకటించిన క్లేడ్-1 రకం వైరస్ కాదు కనుక ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. పైగా క్లేడ్ -2 వైరస్ కొత్త రకం వేరియంట్ కాదు. గత రెండేళ్లలో దేశంలో ఇటువంటివి 30 దాకా నమోదయ్యాయి. ఇప్పుడు వైరస్ సోకిన వాళ్లు విదేశాలకు వెళ్లి అక్కడే మంకీపాక్స్ సోకిన తర్వాత భారత్‌కు వచ్చారు. వేగంగా వ్యాప్తి చెందే వైరస్ కానప్పటికీ.. ఛాన్స్ ఇవ్వొద్దనేది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. మంకీపాక్స్ కేసులు పెరగకుండా రాష్ట్రాలను అలర్ట్ చేసింది.ఈ నేపథ్యంలోనే మంకీ పాక్స్ అలర్ట్‌తో విశాఖలో అప్రమత్తమయ్యారు వైద్యాధికారులు. విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రత్యేక మెడికల్ టీం ఏర్పాటు చేశారు. ఇంటర్నేషనల్ పాసింజర్లపై ప్రత్యేక నిఘా పెంచారు. ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను పరిశీలించారు ఆఓఊూ డాక్టర్ జగదీశ్వర్ రావు. అంతేకాకుండా కింగ్ జార్జ్ ఆసుపత్రి, చెస్ట్ ఆసుపత్రిలోనూ ప్రత్యేక బెడ్స్ ఏర్పాటు చేశారు .మంకీపాక్స్ పై విశాఖ జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కేంద్రం రాష్ట్రాల సూచనలతో.. ప్రత్యేక వైద్యుల కమిటీని నియమించారు. మంకీపాక్స్ పై ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తమయ్యామన్నారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వర్ రావు. ఎయిర్‌పోర్టులో హెల్త్ ఆఫీసర్, డిస్ట్రిక్ట్ సర్వేలెన్సు ఆఫీసర్ తో కూడిన వైద్య బృందాన్ని నియమించామన్నారు. గతంలో ఎయిర్ పోర్ట్ లో కోవిడ్ సమయంలో పనిచేసిన సిబ్బందిని టీం లో చేర్చి పర్యవేక్షిస్తున్నారు. స్క్రీ?నింగ్ చేసి.. సస్పెక్ట్ ఉంటే ఆసుపత్రికి తరలించి ఐసోలేట్ చేస్తున్నారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన వారి ట్రావెల్ హిస్టరీని చెక్ చేస్తున్నారు. విశాఖలో చెస్ట్ ఆసుపత్రి కేజీహెచ్ లో ప్రత్యేక బెడ్స్ సిద్ధం చేశామని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు తెలిపారు.ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రధాయినిగా ఉన్న కింగ్ జార్జ్ ఆసుపత్రిలో వైద్యులు అలర్ట్ అయ్యారు. వైద్య ఆరోగ్య శాఖ సూచనతో.. ముగ్గురు వైద్య నిపుణులతో కమిటీని నియమించారు. వారిలో డెర్మటాలజీ విభాగాతిపతి శాంతి, జనరల్ మెడిసిన్ విభాగ్యాతిపతి డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ సునీల్ కుమార్ బోర్డు మెంబర్ కు సభ్యులుగా ఉన్నారు. కేజీహెచ్ లో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తెలిపారు.ఈ ఏడాది ఆఫ్రికాలో పద్దెనిమిది వేలకుపైగా మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయి. పాకిస్తాన్‌లోనూ మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం.. మంకీపాక్స్? వైరస్ మనిషి శరీరం లోపలికి ప్రవేశించిన తర్వాత 21 రోజుల్లో ఎప్పుడైనా లక్షణాలు బయటపడవచ్చు. జ్వరం, శరీరంపై పొక్కులు, గొంతు ఎండిపోవడం, తల, కండరాల నొప్పులు, వెన్ను నొప్పి, నిస్సత్తువ వంటివి సాధారణంగా కనిపిస్తాయి. ఈ లక్షణాలు దాదాపు రెండు నుంచి నుంచి నాలుగు వారాలపాటు కొనసాగవచ్చు. ఇది ఆ వ్యక్తి రోగ నిరోధక శక్తిపై ఆధారపడి ఉంటుంది. కొంతమందిలో మరికొన్ని లక్షణాలు కనిపించవచ్చు. నోరు, కళ్లు, గొంతు, ప్రైవేట్ భాగాలపై పొక్కులు రావొచ్చు. అయితే ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని.. అపోహలతో కంగారు పడొద్దు అని అంటున్నారు వైద్యులు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

### వైరస్ లక్షణాలు ఇవే..!


## గత ప్రభుత్వాల వైఫల్యంతోనే విజయవాడకు వరదలు : వైఎస్ షర్మిల



అమరావతి : తెలుగుదేశం, వైసీపీ ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే విజయవాడకు వరదలు వచ్చాయని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. బుడమేరు వాగు గురించి అటు జగన్, ఇటు చంద్రబాబు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాకినాడలోని ఇటీవల భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆమె పరామర్శించి రైతులకు ధైర్యం చెప్పారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం పేరిట 42 ప్రాజెక్టులను చేపట్టగా నేటికి 32 పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని అన్నారు. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్ ఐదేళ్లపాటు అధికారంలో ఉన్నా వాటిని పట్టించుకోలేదని, కనీసం ప్రాజెక్టుల నిర్వహణను గాలికొదిలేశారని ఆరోపించారు. ఏలేరు ఆధునికరణ జరగకపోవడం, పూడిక తియ్యకపోవడం వల్లే ఇంతటి విపత్తు ఏర్పడిందన్నారు.రైతులు అప్పులు చేసి పంట వేసి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. జగన్ ఏలేరు ఆధునికరణను చేయకపోవడం తీవ్రంగా నష్టపోయారన్నారు.

## ఏచూరి మరణం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు విచారం

అమరావతి : సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల ఏపీ సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. భారతదేశ రాజకీయాల్లో అత్యంత గౌరవనీయమైన వ్యక్తుల్లో ఏచూరి ఒకరని పేర్కొన్నారు.పార్టీలో కింది స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఏచూరి ఆలోచనలు సీపీఎం(అఖఓ0) పార్టీకి ఎంతో గుర్తింపు తెచ్చిపెట్టాయని అన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులు, సహచరులు, అనుచరులకు చంద్రబాబు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏచూరి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.గత నెల 19వ తేదీన శ్వాసకోశ సమస్యలతో సీతారాం ఏచూరి ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నప్పటికి రెండు రోజులుగా పరిస్థితి మరింత విషమించింది. గురువారం మధ్యాహ్నం ఆయన ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.



# సంపాదకీయం

**శుక్రవారం 13-09-2024**

## కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ గా హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్ఫయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్ఫయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్ఫయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందు కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు. ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ. 6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నినాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.

# వరదల మధ్య గర్భిణికి ప్రసవం..

### హెలికాప్టర్ ద్వారా రక్తం రవాణా

ముంబాయి సెప్టెంబర్ 12, ( మహారాష్ట్రలోని గడ్చిరోలిలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భామ్రగఢ్ తహసీల్లో పరిస్థితి ఘోరంగా తయారైంది. వర్షాల వల్ల అనేక రోడ్లు మూసుకుపోయాయి. ఆ ప్రాంతంతో సంబంధాలు తెగిపోయాయి. అయితే అక్కడ ఓ గర్భిణీ పరిస్థితి విషమంగా మారింది. ఆమెకు అత్యవరంగా రక్తం అవసరం పడింది. దాంతో అధికారులు మహిళ ప్రాణాలను కాపాడేందుకు హెలికాప్టర్లో రక్తాన్ని అందించారు. ఈ ఘటన గడ్చిరోలిలోని భామ్రాగఢ్ తహసీల్ లో చోటు చేసుకుంది. ఇక్కడ వరదల నుంచి బయటకు వచ్చిన ఓ గర్భిణికి వైద్య బృందం ప్రసవం చేసింది. ఒక యూనిట్ రక్తాన్ని ఎక్కించిన తర్వాత, ఆమెకు ఒక బ్యాగ్ ఎక్కువ రక్తం అవసరమైంది. కానీ., వరద కారణంగా రోడ్లన్నీ మూసుకుపోయాయి. ఆ పరిస్థితిలో వర్షం ఆగిన తరువాత ఉదయం హెలికాప్టర్ ద్వారా రక్తాన్ని పంపిణీ చేశారు. మంటోషి గజేంద్ర చౌదరి అనే మహిళ ప్రసవ వేదనతో భమ్రాగఢ్ లోని గ్రామీణ ఆసుపత్రిలో చేరింది. ఇక్కడ వైద్యులు డెలివరీ నిర్వహించారు. ఆ తర్వాత ఆమెకు రక్తం అవసరమైంది. మహిళకు రక్తపు సంచి దొరికినా అది సరిపోలేదు. దాంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. వర్షం, వరదల కారణంగా బయటి నుంచి ప్రయాణించే అవకాశం లేదు. ఇక్కడ వరదల కారణంగా చాలా గ్రామాలతో కనెక్టివిటీ పోయింది. పారల్కోట నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ మొత్తం విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత హెలికాప్టర్లో రక్తాన్ని తీసుకునేందుకు సన్నాహాలు చేయగా, ప్రతికూల వాతావరణం కారణంగా హెలికాప్టర్ ద్వారా రక్తం తీసుకురావడం కష్టంగా మారింది. చివరకు వాతావరణం అనుకూలించడంతో ఆరోగ్య కార్యకర్తలు గడ్చిరోలి నుంచి రక్తం తీసుకుని భామ్రాగఢ్కు బయలుదేరారు. ఇందుకోసం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నీలోత్పాల్ జిల్లా పోలీసు బలగాల హెలికాప్టర్ను అందుబాటులో ఉంచారు. వరద బీభత్సం మధ్య సత్వరం స్పందించిన వైద్య బృందం రక్తంతో వచ్చి మహిళ ప్రాణాలను కాపాడింది.

# మాండ్యలో గణేష్ ప్రదర్శనపై రాళ్ల దాడి : కేంద్ర మంత్రి కుమారస్వామి కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: కర్నాటకలోని మాండ్యలో గణేష్ చతుర్థి సందర్భంగా జరిగిన ఊరేగింపుపై రాళ్ల దాడి కలకలం రేపింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి, కర్నాటక మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి గురువారం స్పందించారు. మాండ్యలో ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, అయితే ఇప్పటికే అల్లరి మూకల దాడిలో విధ్వంసం జరిగిందని



అన్నారు. తాను శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శిస్తానని చెప్పారు. ఈ ఘటనపై తాను ఇప్పటికే సమాచారం సేకరించానని తెలిపారు. గణేష్ ఊరేగింపును భగ్నం చేయాలని కొందరు దుండగులు ప్రయత్నించారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై సరైన రీతిలో స్పందించలేదని ఆరోపించారు. కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుతీరిన అనంతరం ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఓ వర్గం ప్రజల కోసమే పనిచేస్తున్నామనే సంకేతాలు పంపాలని కాంగ్రెస్ పాలకులు కోరుకుంటున్నారని ఆరోపించారు. అందుకే కర్నాటకలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. కర్నాటక శాంతియుత రాష్ట్రమని, కన్నడిగులు ఇలాంటి మత ఘర్షణలకు మద్దతు ఇవ్వరని స్పష్టం చేశారు. ప్రభుత్వ అసమర్థత వల్లే ఇలాంటి ఘర్షణలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుజ్జగింపు రాజకీయాలు మంచిదికాదని సిద్ధరామయ్య సర్కార్‌కు హితవు పలికారు. తాను కూడా రాష్ట్రానికి రెండు సార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించానని, తాను అన్ని వర్గాలకు భద్రత కల్పించానని గుర్తుచేశారు. సమాజంలో ప్రతిఒక్కరి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ప్రభుత్వం అందరికీ సరైన ప్రాధాన్యత ఇవ్వడం కీలకమని హెచ్‌డీ కుమారస్వామి స్పష్టం చేశారు.

# తెలంగాణ భవన్ వద్ద భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్ : తెలంగాణ భవన్‌వద్ద భారీ పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీమధ్య నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో.. తెలంగాణ భవన్ వద్ద భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. కాగా, ఎమ్మెల్యే అరికపూడి గాంధీని కాంగ్రెస్ ప్రభుత్వం పీఏసీ చైర్మన్‌గా ప్రకటించినప్పటి నుంచి విమర్శల పర్వం మొదలైంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లతో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి.



తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఆయన ఇంటిపై కోడి గుడ్లు, టమాటాలు విసిరేశారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలపై కుర్చీలతో దాడికి దిగారు. ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. సవాళ్లు, ప్రతిసవాళ్ల నడుమ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. కొండాపూర్‌లోని కౌశిక్ రెడ్డి నివాసానికి తన అనుచరులతో కలిసి వెళ్లారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయితే గాంధీ అనుచరులు పోలీసులను తోసుకుంటూ ఇంట్లోకి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో గేటు దూకి కౌశిక్ రెడ్డి ఇంట్లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు.. అక్కడే ఉన్న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారు. కోడిగుడ్లు, టమాటాలు విసిరేశారు. ఇంటి అద్దాలను కుర్చీలతో ఇంటి అద్దాలను పగులగొట్టారు. పోలీసులపై చేయిచేసుకున్నారు. ఇంత జరుగుతున్నా గాంధీ అనుచరులు, కాంగ్రెస్ గూండాలను పోలీసులు నిలువరించలేకపోవడం గమనార్హం. సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు క్యాంప్ ఆఫీస్‌పై దాడి ఘటన మరువక ముందే కౌశిక్ రెడ్డి ఇంట్లో కాంగ్రెస్ కార్యకర్తలు విధ్వంసం సృష్టించడం విశేషం.

## అసలైన ఆఫర్లకు సిద్ధమవ్వండి.. అమెజాన్ గ్రేట్ ఇండియన్ సేల్ వచ్చేస్తోంది

దసరా వస్తుందంటే చాలు ఈ కామర్స్ సంస్థలు ఆఫర్లతో కస్టమర్లను అట్రాక్ట్ చేస్తాయి. ఇందులో భాగంగానే సేల్స్ పేరుతో భారీ డిస్కౌంట్స్‌ను అందిస్తుంటాయి. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రముఖ ఈ కామర్స్ సంస్థ ఫ్లిప్‌కార్ట్ బిగ్ బిలియన్ డేస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ మొదలు, గృహోపకరణాల వరకు అన్ని రకాల వస్తువులపై డిస్కౌంట్స్‌ను అందించనున్నారు. సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ఈ సేల్ ప్రారంభం కానుంది. ఇదిలా ఉంటే మరో ప్రముఖ ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సైతం ఆఫర్లను అందించేందుకు సిద్ధమైంది. అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌ను అందించనున్నారు. ఏడాదిలో అతిపెద్ద సేల్ అయిన గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ సేల్‌ను టీజ్ చేసింది. తాజా సమాచారం ప్రకారం అమెజాన్ సేల్ సెప్టెంబర్ 29వ తేదీ నుంచి ప్రారంభం కానునట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే అమెజాన్ ప్రైమ్ మెంబర్స్‌కి ఒకరోజు ముందుగానే సేల్ అవకాశం పొందొచ్చు. అంటే సెప్టెంబ్ 28వ తేదీ అర్థరాత్రి నుంచి అమెజాన్ సేల్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అమెజాన్ సేల్‌కు సంబంధించి పలు వైరల్ అవుతున్నాయి. వీటి ప్రకారం ఏయే ప్రొడక్ట్స్‌పై డిస్కౌంట్స్ లభించనున్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ సేల్‌లో భాగంగా స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ వాచ్‌లు వంటి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ మొదలు ఇతర గృహోపకరణలపై కూడా భారీగా డిస్కౌంట్స్ లభించనున్నాయి. అయితే దీనిపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. ఈ సేల్‌లో భాగంగా యాపిల్ 16 సిరీస్‌పై డిస్కౌంట్స్ లభించే అవకాశాలున్నాయి. వీటితో పాటు సామ్‌సంగ్, ఒప్పో, వన్‌ప్లస్, రియల్‌మీ వంటి ఫోన్‌లపై భారీ డస్కౌంట్స్ అందించనున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు పలు బ్యాంకులకు చెందిన డెబిట్, క్రెడిట్ కార్డులతో వస్తువులను కొనుగోలు చేసే వారికి ఇన్‌స్టాంట్‌గా 10 శాతం డిస్కౌంట్ లభించనుందని తెలుస్తోంది. త్వరలోనే ఈ సేల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రానుంది.

# సీపీఎం నేత సీతారాం ఏచూరి కన్నుమూత



న్యూఢిల్లీ: కమ్యూనిస్టు నేత సీతారాం ఏచూరి కన్నుమూశారు. ఆయన వయసు 72 ఏళ్లు. సీపీఎం ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ ఎంపీ అయిన ఏచూరి.. ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యశాలలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు కొన్ని రోజుల నుంచి అక్కడే చికిత్స చేపడుతున్న విషయం తెలిసిందే. శ్వాసకోస సమస్యతో బాధపడుతున్న ఏచూరి ఇవాళ మరణించినట్లు ఆ పార్టీ ప్రకటించింది. ఆగస్టు 19వ తేదీన ఎయిమ్స్ ఎమర్జెన్సీ వార్డులో ఆయన్ను చేర్పించారు. ఆ తర్వాత ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కు మార్చారు. 2015లో సీపీఎం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకాశ్ కారత్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. పార్టీ నేత హరికిషన్ సింగ్ సుర్జీత్ వద్ద ఏచూరి ఎదిగారు. వీపీ సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ , యునైటెడ్ ఫ్రంట్ కూటమి ప్రభుత్వ ఏర్పాటులో ఏచూరి కీలక పాత్ర పోషించారు. ఆ సమయంలో ప్రభుత్వానికి సీపీఎం బయటి నుంచి మద్దతు ఇచ్చింది. తొలిసారి ఏర్పడ్డ యూపీఏ ప్రభుత్వానికి కూడా లెఫ్ట్ పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఆ సమయంలోనూ ఏచూరి కీలక పాత్రను పోషించాడు. పాలసీ మేకింగ్‌లో కాంగ్రెస్ పార్టీపై ఆయన వత్తిడి తీసుకొచ్చారు.


# కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి. ఎంఎల్ఎ అరెకపూడి గాంధీ అరెస్టు



హైదరాబాద్: బిఆర్ఎస్ ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన శేరిలింగంపల్లి ఎంఎల్ఎ అరెకపూడి గాంధీని పోలీసులు అరెస్టు చేశారు. కౌశిక్ రెడ్డి ఇంటి వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొనడంతో అరెకపూడి గాంధీతో పాటు ఆయన అనుచరులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కౌశిక్‌రెడ్డి సవాల్ నేపథ్యంలో ఆయన ఇంటికి అరెకపూడి గాంధీ వెళ్లారు. కౌశిక్‌రెడ్డి ఇంటి బయట అరికెపూడి గాంధీ తన అనుచరుల ధర్నా చేపట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కౌశిక్‌రెడ్డి ఇంటిపై గాంధీ అనుచరులు కోడి గుడ్లు, టమాటాలు విసిరారు. కౌశిక్‌రెడ్డి ఇంట్లో గాంధీ ధర్నాకు దిగారు. కౌశిక్‌రెడ్డికి దమ్ముంటే బయటకు రావాలని, తాను ఇక్కడే ఉన్నానంటూ గాంధీ సవాల్ విసిరారు. వెంటనే పోలీసులు అరెకపూడి గాంధీతో ఆయన అనుచరులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. తెలంగాణలో ఒక ఎంఎల్ఎకే రక్షణ లేదని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. సామాన్య ప్రజలకు ప్రభుత్వం ఎలా రక్షణ ఇస్తుందని ప్రశ్నించారు. తనని హత్య చేయడానికే తన ఇంటికి వద్దకు వచ్చారని, రేపు ఉదయం 11 గంటలకు బిఆర్ఎస్ పార్టీ తడాఖా చూపిస్తామన్నారు. ఇవాళ అరెకపూడి గాంధీ చేసిన చర్యకు రేపు ప్రతిచర్య ఉంటుందని కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. అరెకపూడి గాంధీ కృష్ణా జిల్లా నుంచి హైదరాబాద్‌కు వచ్చారని, తాను నిఖార్సైన తెలంగాణ బిడ్డను అని తెలిపారు.

## సమయస్ఫూర్తితో స్టూడెంట్ ప్రాణాలు కాపాడిన డ్రైవర్, కండక్టర్ పై ఆర్టీసీ ఎండి సజ్జనార్ ప్రశంసల వర్షం..

హైదరాబాద్ : రెప్ప పాటులో జీవితం తలకిందులు అవుతుంది. ఒకొక్కసారి సకాలంలో స్పందిస్తే ఆ మనిషి ప్రాణాలు కాపాడవచ్చు. అయితే ఇందుకు కావాల్సింది కష్ట కాలంలో వేగంగా ఆలోచించే తీరు..స్పందించి సాయం చేసే గుణం.. అలా ఓ ప్రయాణీకుడు ప్రాణాలను కాపాడిన బస్సు కండక్టర్, డ్రైవర్ పై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తున్నాయి. బస్సులో హటాత్తుగా వచ్చిన గుండె నొప్పితో విలవిలాడుతున్న స్టూడెంట్ కు వైద్య సాయం సకాలంలో అందించి ప్రాణాలను కాపాడిన బస్సు డ్రైవర్, కండక్టర్ ను తెలంగాణా ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది. వివరాల్లోకి వెళ్తే..ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని భైంసా డిపోకి చెందిన కండక్టర్ జి.గంగాధర్, డ్రైవర్ బి.గంగాధర్ లు ఈ నెల 9వ తేదీన భైంసా నుంచి నిర్మల్ కి బస్సు వెళ్తున్న బస్సులో విధులను నిర్వహిస్తున్నారు. ఈ బస్సు దిలావర్‌పూర్ వద్దకు చేరుకుంది. అప్పుడు హటాత్తుగా 12 ఏళ్ల విద్యార్థి కిరణ్ గుండె నొప్పితో కుప్ప కూలిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన కండక్టర్ గంగాధర్ వెంటనే అప్రమత్తమయ్యాడు. బస్సుని రోడ్డు పక్కకు ఆపించి బి.గంగాధర్‌తో కలిసి ప్రాథమిక చికిత్స అందించాడు. వెంటనే



కిరణ్ ను ఆ బస్సులోనే సమీపంలో ఉన్న నర్సాపూర్ పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. సకాలంలో కిరణ్ ను ఆస్పత్రికి తీసుకుని వెళ్ళడం వలన ప్రాణాపాయం తప్పిందని వైద్యులు చెప్పారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి స్టూడెంట్ ప్రాణాలను కాపాడిన డ్రైవర్, కండక్టర్ లను హైదరాబాద్ బస్ భవన్ లో ఉన్నతాధికారులతో కలిసి సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ ఘనంగా సన్మానించారు. నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ ఆపద సమయంలో సేవాతర్పరతను ఆర్టీసీ సిబ్బంది చాటుతుండటం గొప్ప విషయమని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు.. అనుకోకుండా ఆపద ఎదురైతే సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తూ తాము ఉన్నామని ప్రయాణీకులకు భరోసా కల్పిస్తుండటం అభినందనీయమని ప్రశంసించారు.

# విశాఖలో వానల టెన్షన్



విశాఖపట్టణం, సెప్టెంబర్ 12, ఏపీ యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ ప్రభావంతో ఉత్తర కోస్తాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు బలమైన గాలులు గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. దక్షిణ కోస్తాలోనూ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు కొన్ని చోట్ల 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో కూడా వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాయలసీమలోనూ తేలికపాటి నుంచి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. బలమైన ఈదురు గాలులు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపారు

విశాఖకు చంద్రబాబు

సీఎం చంద్రబాబు ఇక, విశాఖకు వెళ్లనున్నారు. మంగళవారం రాత్రికి ఆయన విశాఖకు వెళ్లనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం విజయవాడలో పరిస్థితి సర్దుమణిగింది. లోతట్టు ప్రాంతాల్లో ఇంకా వరద తగ్గక పోయినా.. ప్రధానంగా బుడమేరు తీవ్రత మాత్రం తగ్గిపోయింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటిని మోటార్ల ద్వారా ఇతర ప్రాంతాల్లోకి తోడుతున్నారు. మరోవైపు.. సింగునగర్, ప్రకాశ్ నగర్, శాంతినగర్, కండ్రిక సహా.. ఇతర అన్ని ప్రబావిత ప్రాంతాల్లోనూ సాయం అందిస్తున్నారు. రేషన్ సహా.. పాలు, నీళ్లు ఇతర వస్తువులు కూడా అందిస్తున్నారు. దీంతో ప్రజలు కొంత ఊరట చెందుతున్నారు. దీంతో మంగళవారం సాయంత్రం చంద్రబాబు విజయవాడ శివారు ప్రాంతాల్లో పర్యటించి.. మరోసారి బాధితులను పలకరించారు. వారికి అందుతున్న సాయాన్ని విచారించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. అందరికీ పేరు పేరునా సాయం అందుతోందా లేదా.. అనే విషయాన్ని సీనియర్ అధికారులు పరిశీలించాలని.. ఏ ఒక్క రూ తమకు సాయం అందలేదన్న ఫిర్యాదు చేయడానికి వీల్లేదని అన్నారు. మరోవైపు బాధితులకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియ కూడా మంగళవారం, బుధవారం యుద్ధప్రాతిపదికన చేయనున్నారు. ఇదిలావుంటే.. విజయవాడ పరిస్థితి ఒకింత ఒడ్డున పడుతుంటే..మరోవైపు ఉత్తరాంధ్ర జిల్లాలు తుఫాను బీభత్సంతో అల్లాడుతున్నాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు వచ్చాయి. విజయనగరంలో కొండచరియలు విరిగి పడి పదికి పైగా గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. నదులు? ఇతర వాగుల పరవళ్లు ఉగ్రరూపం దాల్చాయి. పలు చోట్ల రహదారులు కొట్టుకుపోయి, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఉత్తరాంధ్ర ఇప్పుడు వణికిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో సీఎం చంద్రబాబు మంగళవారం రాత్రి లేదా.. బుదవారం ఉదయం విశాఖపట్నం వెళ్తున్నారు. అక్కడే మూడు రోజుల వరకు ఆయన ఉండనున్నారు. బాధిత ప్రాంతా ల్లో పర్యటించి.. ప్రజలకు ధైర్యం చెప్పనున్నారు. అదేవిధంగా వారికి సాయం కూడా అందించనున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఆన్‌లైన్‌లో అక్కడి పరిస్థితిని తెలుసుకుంటున్నారు. అదేవిధంగా సీనియర్ అధికారులను కూడా మోహరించారు. అయితే.. క్షేత్రస్థాయిలో తాను ఉంటే తప్ప.. బాధితులకు ఓదార్పు దక్కదన్న భావనతో చంద్రబాబు విశాఖకు వెళు_న్నారు.

# ఇన్సూరెన్స్ కంపెనీలకు జనాలు క్యూ...

విజయవాడ, సెప్టెంబర్ 12, (న్యూస్ పల్స్) నీట మునిగిన విజయవాడ ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. ఇళ్లకు చేరిన ప్రజలు ఇంటిని సర్దుకుంటున్నారు. జరిగిన నష్టాన్ని అంచనా వేసుకుంటున్నారు. ఓవైపు ప్రభుత్వం కూడా జరిగిన నష్టంపై లెక్కలు తీస్తోంది. ఓ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఫైనల్ రిపోర్ట్‌పై కసరత్తు చేస్తోంది. ఎంత చేసిన పూర్తి స్థాయి నష్టం పూడ్చడం ప్రభత్వం వల్ల అయ్యే పని మాత్రం కాదు. అందుకే వీలైనంతగా ప్రజలకు వెసులుబాటు కల్పించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే చెడిపోయిన వాహనాల ఇన్సురెన్స్‌పై ఫోకస్ చేసింది. వరదల్లో చాలా వరకు టూవీలర్స్, ఇతర వెహికల్స్ డ్యామేజీ అయ్యాయి. కొన్ని కొట్టుకుపోయాయి. మరికొన్నింటిని ప్రజలు మరమ్మతులు చేయించుకుంటున్నారు. అయినా అవి పని చేస్తాయో లేదో కూడా తెలియదు. వీటినే నమ్ముకున్న ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అందుకేప్రభుత్వ బీమా కంపెనీలతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపించింది. బీమా సంస్థ ప్రతినిధులతో మాట్లాడిన ప్రభుత్వం వెహికల్ ఇన్సూరెన్స్ సమస్యలు పరిష్కరించేలా చొరవ చూపించింది. అన్ని బీమా సంస్థలను ఒక చోట చేర్చింది. ప్రభుత్వ ఆదేశాలతో ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ పరిష్కారం కోసం విజయవాడలోని మాంటిస్సోరి కాలేజీలో ప్రతినిధులు ఓ ఫెసిలిటీ సెంటర్ పెట్టారు.మూడు రోజులుగా వందల మంది ప్రజలు వచ్చి సమస్యలు చెప్పుకుంటున్నారు. బీమా డబ్బుల కోసం రిక్వస్ట్‌లు పెట్టుకుంటున్నారు. దాదాపు 27 బీమా కంపెనీలు ఇక్కడ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఒక్క వాహనదారులే కాకుండా వ్యాపారులు కూడా ఈ ఫెసిలిటీ సెంటర్‌కు వస్తున్నారు. బీమా సొమ్ము క్లెయిమ్ కు రిక్వస్ట్‌లు పెట్టుకుంటున్నారు. విజయవాడలో దాదాపు వారం పదిరోజులుగా వరద నీటిలో ఉ ండిపోయిన వాహనాలు ఉండిపోవడంతో తీవ్రంగా నష్టపోయామంటున్నారు ప్రజలు. అందుకే పూర్తి స్థాయిలో క్లెయిమ్స్ వచ్చే చూడాలని కంపెనీ ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. బీమా కంపెనీలు కూడా టూ వీలర్స్‌కు, ఇతర వాహనాలకు వేర్వేరుగా లెక్కకట్టి రిజిస్ట్రేషన్ చేసిన సంవత్సరం బట్టి బీమా ఇచ్చే ఆలోచనలో ఉన్నాయి. ఈ డబ్బులు కూడా వన్‌టైం సెటిల్‌మెంట్‌గా వినియోగదారులకు ఇవ్వాలని చూస్తున్నారు. జరిగిన నష్టంతో పోల్చుకుంటే మాత్రం కంపెనీలు ఇచ్చింది చాలా తక్కువని వాపోతున్నారు ప్రజలు. ఉదారంగా ఆదుకోవాలని అభ్యర్థిస్తున్నారు. అంతే కాకుండా మునిగిపోయిన వాహనాల ఫొటోలు అడుగుతున్నారని వాటిని ఎలా తీసుకొస్తామని ప్రశ్నిస్తున్నారు. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కూడా క్లెయిమ్ కావడం లేదని వాపోతున్నారు. అయితే పేపర్స్ లేవని ఇతర డాక్యుమెంట్స్ లేవనే బెంగ వద్దని నెంబర్ ఉంటే చాలు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు

# తండ్రి చేతిలో తనయుడి హతం.

ఆత్మకూర్( ఎస్)మద్యానికి బానిసై డబ్బుల కోసం వేధిస్తుండగా విసుగు చెందిన తండ్రి కుమారుడిని గొడ్డలితో నరకడం తో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్త తండా ఆవాసం బాపూజీ తండాలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బానోత్ కిరణ్ (36) మద్యానికి బానిసై డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులతో పాటు భార్యను వేధిస్తున్నాడు. బుధవారం భార్య సౌజన్య ఆరోగ్యం బాగోలేక హాస్పిటల్ కు వెళ్ళగా తన భార్యను హాస్పిటల్ లో చూపించడానికి డబ్బులు ఇవ్వాలంటూ కిరణ్ తన తండ్రి బానోతు పంతులు పై ఒత్తిడి తీసుకువచ్చాడు ఈ సమయంలో విసుకు చెందిన పంతులు పక్కనే ఉన్న గోడలతో కిరణ్ పై దాడి చేయగా తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు ఘటన స్థలాన్ని సిఐ సురేందర్ రెడ్డి ఎస్సై సైదులు సందర్శించారు. మృతుని భార్య సౌజన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

## జాతీయ రహదారిపై ప్రమాదం

ముమ్మిడివరం ముమ్మిడివరం మండలం బొండాయికోడు సమీపంలో జాతీయ రహదారిపై నుండి పంట కాలువలోకి బొల్తా పడింది. ఘటనలో ఆటో డ్రైవర్ మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ముమ్మిడివరం పోలీసులు విచారిస్తున్నారు

# చంద్రబాబుపై ఒక్కటి కూడా నిలవని అవినీతి కేసులు

హైదరాబాద్/విజయవాడ,సెప్టెంబర్12 : తెలుగుదేశం పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబునాయుడుది సుదీర్ఘ రాజకీయ చరిత్ర. నాలుగు దశాబ్దాలకపైగా ప్రజా జీవితంలో ఉన్నారు. నాలుగోసారి సీఎంగా ఉన్నారు. మిగిలిన కాలం ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఇంత కీలకమైన బాధ్యతలు నిర్వర్తించిన వారిపై ఆరోపణలు రావడం.. కేసులు నమోదవడం సహజం. అయితే చంద్రబాబునాయుడు పై జగనమోహన్ రెడ్డి ప్రభుత్వంలో పెట్టిన కేసులు తప్ప.. అంతకు ముంద కేసులు లేవు. ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న ఒకటి రెండు కేసులు ఉండేవి. కానీ ఆయనపై లెక్కలేన్ని పిటిషన్లు కోర్టుల్లో పడ్డాయి. అలాగే హౌస్ కమిటీలు విచారణలు జరిపాయి. కానీ ఏమీ తేల్చలేకపోయాయి. తాజాగా ఐఎంజీ పిటిషన్లోనూ ప్రాథమిక ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. దీంతో ఈ కేసు విషయంలో ఎవరిలోనైనా అనుమానాలు ఉంటే క్లియర్ అయినట్ల అయింది. చంద్రబాబు మొదటి సారి, రెండో సారి సీఎంగా ఉన్నప్పు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి కోర్టుల్లో పలు పిటిషన్లు వేశారు. వాటిని పూర్తి స్థాయిలో విచారణ చేయక ముందే ఉపసంహరించుకున్నారు. తర్వాత వైఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 23 హౌస్ కమిటీలు వేశారని టీడీపీ నేతలు చెబుతూంటారు. అనేక కమిటీలు చంద్రబాబు పదేళ్ల పాలనలో అవినీతిని వెలికి తీసేందుకు ప్రయత్నించాయి. ఇప్పుడు కోర్టు కొట్టేసిన ఐఎంజీ సహా అనేక ఒప్పందాలను పరిశీలించారు. చంద్రబాబుకు ఆయన కుటుంబానికి ఏమైనా అనుచిత లబ్ది కలిగిందా.. ఆయన కుటుంబానికి ఎక్కడైనా బినామీ ఆస్తులున్నాయా అన్నదానిపై ఆరా తీశారు. అన్ని ఆరోపణలే కానీ ఒక్కటి రుజువులు చూపించలేకపోయారు. చంద్రబాబుపై ఎవరైనా కోర్టల్లో పిటిషన్లు వేస్తే స్టే తెచ్చుకుంటారని ఆయన ఇలా పదుల సంఖ్యలో స్టేలు తెచ్చుకున్నారని రాజకీయ ప్రత్యర్థులు ఆరోపిస్తూ ఉంటారు. కానీ ఆయనపై ఎలాంటి కేసులు పెండింగ్ లో లేవు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నమోదు చేసిన ఇరవైపికి పైగా కేసులు తప్ప.. చంద్రబాబుపై అంతకు ముందు కేసులు లేవు. మహారాష్ట్రలో బాబ్లీ ప్రాజెక్టు పోరాటం కేసు ఉంది. అయితే ఏ కేసులోనూ చంద్రబాబు స్టే తెచ్చుకోలేదు. ఏపీలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబుపై పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. తనపై ఎన్ని కేసులు నమోదు చేశారో తనకే తెలియడం లేదని. పోలీసులు కూడా చెప్పడం లేదని. కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చివరికి ఆయనపై ఇరవైకిపైగా కేసులు ఉన్నట్లుగా లెక్క తేల్చారు. ఇవన్నీ తప్పుడు కేసులేనని టీడీపీ ఆరోపణ. అనేక అవినీతి కేసులు పెట్టినప్పటికి.. ఫలానాస్కాంలో చంద్రబాబు, ఆయన కుటుంబానికి

### కేసులు వేసినా రుజువు చేయలేక పోవడంతో కొట్టివేత
### తాజాగా ఐఎంజి కేసు కూడా అలాంటిదే

ఇంత డబ్బులు ముట్టాయన్న మనీ ట్రయల్ ను మాత్రం దర్యాప్తు సంస్థలు కోర్టుకు సమర్పించలేకపోయాయి. నిధుల మళ్లింపు, దుర్వినియోగం అనే ఆరోపణలతో కేసులు పెట్టారు కానీ.. వాటిని నిరూపించే విషయంలో కోర్టుల ముందు.. ప్రజల ముందు వివరాలు పెట్టలేకపోయారు. ఐఎంజీ పేరుతో క్రీడాభివృద్ధి నిమిత్తం హైదరాబాద్ గచ్చిబౌలి, రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలలో 850 ఎకరాల భూకేటాయింపులతోపాటు 2003లో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాలపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ విజయసాయిరెడ్డి, న్యాయవాది టి.శ్రీరంగారావు, ఏబీకే ప్రసాద్ దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు బుధవారం కొట్టివేసింది. 2012లో దాఖలు చేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని అధికరణ 226 కింద విచక్షణాధికారంతో న్యాయస్థానం ఆదేశాలు జారీచేయాలంటే కోర్టును ఆశ్రయించే వ్యక్తి నిజాయతీతో, సదుద్దేశంతో ఉండాలని, ఎలాంటి వాస్తవాలను దాచరాదని హైకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. న్యాయప్రక్రియ దుర్వినియోగం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొంది. చట్టం చదరంగం ఆట కాదని.. వాస్తవాలతో కోర్టుకు రావాల్సి ఉందని స్పష్టం చేసింది. గతంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వై.ఎస్.విజయమ్మ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో, అనంతరం పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి దాఖలు చేసిన క్రిమినల్ కేసులోనూ ఐఎంజీ భారత అకడమీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూముల కేటాయింపు విషయం ఉన్నా.. దీన్ని ప్రస్తావించకుండా విజయసాయిరెడ్డి తదితరులు ఈ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు కోరుతూ పిటిషన్ వేయడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. ఇప్పటికే తేల్చిన అంశాలపై తిరిగి పిటిషన్ వేయడాన్ని, రాజకీయ ప్రత్యర్థిని లక్ష్యంగా చేసుకోవడాన్ని, ఆరేళ్లపాటు మౌనంగా ఉండి తర్వాత కోర్టును ఆశ్రయించడాన్ని అంగీకరించలేమని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఐఎంజీ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడానికి ఎలాంటి కారణాలు చూపలేకపోయారని వ్యాఖ్యానించింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన వ్యక్తుల పూర్వాపరాలను కూడా పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. పిటిషనర్లలో ఒకరైన విజయసాయిరెడ్డి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సలహాదారని, జగన్ ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభకు ఎంపికయ్యారంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు జరిపిన భూకేటాయింపులపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ హైకోర్టుతోపాటు సుప్రీంకోర్టు కూడా విజయమ్మ పిటిషన్లను కొట్టివేశాయని ధర్మాసనం పేర్కొంది. అనంతరం పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి ఏసీబీ కోర్టులో ఫిర్యాదు దాఖలు చేయగా కొట్టివేసిందని, హైకోర్టు కూడా కొట్టివేసిందని పేర్కొంది. ఐఎంజీ భూముల వ్యవహారం ఒప్పందంపై సీబీఐ దర్యాప్తు చేయడానికి ఎలాంటి కేసు నమోదు చేయడంగానీ, ఫిర్యాదుగానీ లేవని ధర్మాసనం పేర్కొంది. 2006లో సీబీఐ దర్యాప్తు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని.. అయితే ప్రాథమిక దర్యాప్తు జరిపి నివేదిక సమర్పించాలంటూ సీబీఐ 2007 జనవరిలో ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపింది. అనంతరం మరో 8 నెలల తరువాత మరో లేఖ రాసినా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక దర్యాప్తు జరిపించి నివేదిక సమర్పించలేదని వెల్లడించింది. అనంతరం అప్పటి ముఖ్యమంత్రి దర్యాప్తు చేపట్టాలంటూ సీబీసీఐడీకి ఆదేశాలు జారీ చేసినా.. దర్యాప్తు చేయలేదంది. దర్యాప్తు ఎందుకు నిర్వహించలేదో ప్రభుత్వం ఎలాంటి కారణాలనూ చెప్పలేదంది. అందువల్ల సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడానికి ఎలాంటి కేసు లేదంటూ పిటిషన్లను తిరస్కరించింది.

# సెబ్ స్థానంలో ఎక్సైజ్

గుంటూరు, సెప్టెంబర్ 12, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో వైసీపీ హయాంతో ఏర్పాటు చేసిన సెబ్ ను రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోకు కేటాయించిన 4,393 మంది (70 శాతం) ఎక్సైజ్ శాఖ సిబ్బందిని తిరిగి మాతృ శాఖలోకి తీసుకువచ్చే అవకాశం కనిపిస్తోంది. వైసీపీ హయాంలో సెబ్ ఏర్పాటు చేయకముందు ఉన్న తరహాలో ఎక్సైజ్ శాఖ వ్యవస్థను మళ్లీ పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సెబ్ రద్దు చేసేందుకు ఏపీ కేబినెట్ అమోదం తెలిపింది. ఈ క్రమంలో సెబ్ రద్దు చేస్తున్నట్లు అధికారిక ఉత్తర్వులను ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు విడుదల చేశారు. సెబ్ ఏర్పాటు చేసే సమయంలో ఎక్సైజ్ శాఖలో ఉన్న 6,274 మంది సిబ్బంది ఉండగా, వారిలో 1,881 (30 శాతం) మందిని అదే శాఖలో ఉంచారు. మిగతా సిబ్బంది గత వైసీపీ ప్రభుత్వం సెబ్ లోకి తీసుకొచ్చింది. తాజాగా ఏపీ ప్రభుత్వం సెబ్ రద్దు చేయడంతో ఆ సిబ్బందిని తిరిగి మాతృశాఖ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ కు తిరిగి తీసుకొస్తున్నారు. ఐజీ ర్యాంకు ఉన్న ఓ ఐపీఎస్ అధికారి నేతృత్వంలో త్వరలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏర్పాటు చేయనున్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యంపై భారీగా దోపిడీ జరిగిందని కూటమి నేతలు ఆరోపిస్తున్నారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో మద్యంపై టార్గెట్ పెట్టి, తమదైన రీతిలో మద్యంపై భారీగా అక్రమం సంపాదన పోగేశారని ఆరోపణలున్నాయి. క్రెడిట్, డెబిట్ కార్డులు, ఆన్ లైన్ ట్రాన్సాక్షన్ బదులుగా ఆఫ్‌లైన్ విధానంలో మద్యం విక్రయాలతో అపరిమిత దోపిడీకి వైసీపీ ప్రభుత్వం తెరతీసిందని టీడీపీ, బీజేపీ నేతలు పలుమార్లు ఆరోపించారు. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరీ సైతం ఓసారి మద్యం దుకాణానికి వెళ్లి ఆరోజు జరిగిన మద్యం విక్రయాలు, లెక్కలు చెక్ చేసి లెక్కలు బయటపెట్టడం అప్పట్లో దుమారం రేపింది. మద్యంపై జగన్ భారీగా పోగేశారని, లిక్కర్ విక్రయాల ఆదాయం తాడేపల్లి ప్యాలెస్ కు వెళ్తోందని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని సైతం అప్పటి విపక్ష నేతలు ఢిల్లీకి వెళ్లి సైతం ఫిర్యాదు చేయడం తెలిసిందే

# వరద బాధితులకు ప్యాకేజీ కసరత్తు

గుంటూరు, సెప్టెంబర్ 12, విజయవాడ వరదల్లో నీట మునిగిన ఇళ్ల బాధితుల కోసం ప్రభత్వం పరిహారం ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరిగి నష్టం అంచనా వేస్తున్నారు నష్టం అంచనాలు పూర్తయిన తర్వాత బాధితుల ఖాతాల్లోకి నగదు జమ చేయనున్నారు. ఎంత ఎంత పరిహారం ఇవ్వాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. నీట మునిగిన ఇళ్ల విషయంలో ప్రభుత్వం మరింత ఉదారంగా ఉండాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అలాంటి ఇళ్లకు కనీస పరిహారంగా రూ. పాతిక వేల రూపాయలు ఇవ్వాలన్న ఆలోచనలో ఉంది. అలాగే ఆ ఇంట్లో ధ్వంసమైన ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాల రిపేర్ల కోసం కూడాకొంత మంది పరిహారం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇక పూర్తికా కాకపోయినా కొంత మొత్తంలో నీరు వచ్చిన ఇళ్లకు కూడా రూ. పది వేల చొప్పున పరిహారం ఇచ్చే అవకాశం ఉంది. రిపేర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బైకులు వంటి వాటి కోసం అదనపు పరిహారం చెల్లించేందుకు కసరత్తు చేస్తోంది. బుడమేరు ముంపు కారణంగా వచ్చిన వరదలతో సింగ్ నగర్ తో పాటు ఆ చుట్టుపక్క ప్రాంతాలన్ని తీవ్రంగా ప్రభావితమయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో మొదటి అంతస్తు వరకూ నీరు వచ్చాయి. ఈ కారణగా ఎవరూ తమ ఇళ్లల్లో ఉండలేకపోయారు. అలాగే విలువైన వస్తువుల్నికూడా తీసుకెళ్లలేకపోయారు నీట మునిగి బైకులు ఎందుకు పనికి రాకుండా పోయాయి. చాలా మందికి ద్విచక్ర వాహనం ఉపాధి కి కీలకం. అందుకే ప్రభుత్వం వాహనాల రిపేర్లకు.. ప్రత్యేక పరిహారం ఇవ్వాలనుకుంటోంది. ఇక ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పంట నష్టంపై అంచనాలు వేస్తున్నారు. మిగతా పరిహారంతో పాటు పంటలకు కూడా పరిహారంజమ చేయనున్నారు. గతంలో ఇచ్చే దాని కన్నా ఎక్కువ పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. వరదల వల్ల జరిగిన పంట నష్టానికి సంబంధించిన వివరాలను.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపారు. డిజాస్టర్ రిలీఫ్ ఫండ్ నుంచి వచ్చే నిధులతో పరిహారం జమ చేసే అవకాశం ఉంది.

# విశాఖ నుంచి మరిన్ని సర్వీసులు

విశాఖపట్టణం, సెప్టెంబర్ 12, విశాఖపట్నం విమానాశ్రయం నుంచి మరో నాలుగు కొత్త సర్వీసులు నడవనున్నాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ వైజాగ్ నుంచి నాలుగు విమాన సర్వీసులను నడపనుంది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ కృషి వల ఇండిగో ఎయిర్‌లైన్స్ ఈ నిర్ణయం తీసుకుంది. నాలుగు సర్వీసులలో ఒకదాన్ని ఈ నెలలోనే ప్రారంభించనున్నారు. మిగతా మూడు సర్వీసులను అక్టోబర్ నెలలో ప్రారంభించనున్నారు. సెప్టె?ంబర్ 21న ఉదయం 9 గంటలకు విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు కొత్త విమాన సర్వీసు ప్రారంభం కానుంది. అలాగే అక్టోబర్ 27న విశాఖ- విజయవాడ, విశాఖ- హైదరాబాద్ సర్వీస్ ప్రారంభం కానుంది. విశాఖపట్నం- విజయవాడ మధ్య ప్రారంభమయ్యే సర్వీసు ఉదయం 9 గంటల 15 నిమిషాలకు స్టార్ట్ కానుంది. ఇక వైజాగ్- హైదరాబాద్ మధ్య అక్టోబర్ 27న ప్రారంభమయ్యే సర్వీసు మధ్యాహ్నం ఒంటి గంటకు విశాఖ విమానాశ్రయం నుంచి బయల్దేరనుందని అధికారులు తెలిపారు. వీటితో పాటుగా విశాఖపట్నం- అహ్మదాబాద్ మధ్య వారానికి మూడు రోజులపాటు కొత్త సర్వీసును కూడా అక్టోబర్ నెలలో ప్రారంభించనున్నారు. ఇక అధికారుల నిర్ణయం పట్ల స్థానికులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. విశాఖ నుంచి విజయవాడకు, హైదరాబాద్ మధ్య నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఈ క్రమంలోనే విశాఖ నుంచి నూతన సర్వీసులు ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు విశాఖపట్నం విమానాశ్రయంలో ఇటీవలే నూతన సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. డిజీ సేవలను విశాఖ ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇటీవల ప్రారంభించారు. విశాఖతో పాటుగా రాంచీ, భువనేశ్వర్, ఇండోర్, గోవా, పట్నా, రాయ్‌పూర్, కోయంబత్తూరు సహా 9 చోట్ల డీజీ సేవలను కేంద్ర మంత్రి ప్రారంభించారు. వీటితో కలిపి దేశవ్యాప్తంగా ఉన్న 24 విమానాశ్రయాల్లో డీజీ యాత్ర సేవలు అందుబాటులోకి వచ్చినట్లు కేంద్రం తెలిపింది. ఇక ఈ సేవలు అందుబాటులోకి రావటం ద్వారా ప్రయాణికులు విమానాశ్రయంలోకి సులభంగా ప్రవేశించేందుకు వీలవుతుంది. ఫేసియల్ రికగ్నిషన్ ద్వారా ఈ యాప్ పనిచేస్తుంది. దీనిని ఇప్పటి వరకూ మూడు కోట్ల మంది విమాన ప్రయాణికులు వినియోగించుకున్నారు.

## ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ...



విభారె న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12...ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్ రెడ్డి ని జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపీయస్ కర్నూల్ సంతోష్ నగర్ లోని లోకాయుక్త కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు.

## శనివారం సూర్య దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామి వారి కల్యాణం....



విభారె న్యూస్ కర్నూలు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12..శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రులలో భాగంగా 14-09-2024 శనివారం ఉదయం 8-55 నిమిషములకు శ్రీ సిద్ధి బుద్ధి సహిత వరసిద్ధి వినాయక స్వామి వారి కళ్యాణం మహోత్సవం నిర్వహించబడును. కళ్యాణంలో భక్తాదులు పాల్గొని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు.ప్రధానంగా కళ్యాణ రుసుము-3,000కళ్యాణ సంకల్పం-116పూజా వివరములకు సంప్రదించగలరు .దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు:8896123777.

## భక్తితోనే మానవాళికి విముక్తి. వైయస్సార్సీపి. నాయకురాలు..... నాగవేణి రెడ్డి ..

విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి భక్తితోనే మానవాళికి, మనిషి జీవితానికి విముక్తి కలుగుతుందని ప్రముఖ కాంట్రాక్టర్ నరసింహారెడ్డి సతీమణి, వైఎస్ఆర్సిపి నాయకురాలు కళా నాగవేణి రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఏ హెచ్ కె నగర్ లోని ఏ హెచ్ కె యువసేన వరసిద్ధి వినాయక భక్త బృందం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమం, పర్యావరణ రక్షణ పోస్టర్ విడుదల కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. ఏ హెచ్ కె నగర్ యువత ఐక్యతతో ఇంత మంచి కార్యక్రమం నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఆమె తెలిపారు. ప్రతి ఏటా ఈ కాలనీవాసులు ఐక్యంగా ఉంటూ ఇలాంటి పుణ్య కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తుంటారని ఆమె పేర్కొన్నారు. రోజు కూలి పనుల్లో కష్టపడే వీరు ఈ వినాయక మండపాని ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజ కార్యక్రమాలతో ముందుకెళ్లడం ఎంతో సంతోషించేదగ్గ విషయమని ఆమె చెప్పారు. ఏ భక్తి కార్యక్రమమైన వీరు ఐక్యతతో ఉండి ముందుకెళ్లడం ఎంతో సంతోషించదగ్గ విషయమని అన్నారు. అనంతరం ఆమె ప్లాస్టిక్ నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ప్లాస్టిక్కు నివారించి మన పర్యావరణాన్ని మనం కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. గోవులను రక్షించి పూజించాలని ఆమె కోరారు. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాయన నాటి పచ్చదనాన్ని కాపాడాలని కోరారు. వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం దేవాలయాల పరిరక్షణ సమితి సభ్యులు సఫారీ గోవిందరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ ను నివారించకుంటే మన మనవడమే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. మనం వాడి పడేసిన ప్లాస్టిక్ కవర్లను మూగజీవాలైన గోవులు తింటూ అజీర్తితో అనారోగ్య పాలవుతూ ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆయన గుర్తు చేశారు. మొదటగా మనం ప్లాస్టిక్ నివారణ పాటించాలని ఆయన కోరారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపయోగకరమైనవని, వాటి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏ హెచ్ కె నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.





# " చేయి చేయి కలుపుదాం విజయవాడ ప్రాంతం వరద బాధితులను ఆదుకుందాం..."



విభారె న్యూస్ ఎమ్మిగనూరు సెప్టెంబర్ 12..సామాజికవేత్త మల్లెల గ్రూప్స్ అధినేత డా. మల్లెలర్ఫ్రెడ్ రాజు చేపట్టిన చేయి చేయి కలుపుదాం విజయవాడ ప్రాంతం వరద బాధితులను ఆదుకుందాం కార్యక్రమానికి ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలనుంచి మంచి స్పందన రావడం జరుగుతుంది.అందులో భాగంగానే ఎమ్మిగనూరు పట్టణంలోని లిటిల్ ప్లానెట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం మని మాధురి,స్కూల్ స్టాఫ్, స్కూల్లోని చిన్న పిల్లలతో సహా మంచి మనసుతో, మానవసేవే మాధవసేవ అనే భావనతో వరద బాధితుల కోసం నిత్యవసర సరుకులను, కొంత ఆర్థిక సహాయమును అందించడం జరిగింది.అదేవిధంగా ఎమ్మిగనూరు పట్టణంలోని బ్రాండ్స్ ఫ్యాషన్ అండ్ స్టైల్ బట్టల యజమాని కృష్ణారెడ్డి వారి కుమారుడు దినేష్ రెడ్డి వారి షాపులో వ్యాపారి నిమిత్తం పెట్టుకున్నటువంటి బట్టలను వరద బాధితుల కోసం మానవత్వంతో కొత్త బట్టలను అందించి, మంచి మనసును చాటుకోవడం జరిగింది.అదేవిధంగా మైసూర్ విప్రబాంధవ సంస్థకు సంబంధించిన సభ్యులు గురురాజు రావు మల్లెల గ్రూప్ సేవలకు ఆకర్షితులై గతంలో అనగా 2009వ సంవత్సరంలో మంత్రాలయం వరదల సమయంలో కూడా మల్లెల గ్రూప్ ద్వారా 5 లక్షల రూపాయలు విలువ చేసే నిత్యవసర సరుకులను ఆ ప్రాంత ప్రజలకు అందించడం జరిగింది. ఇప్పుడు కూడా విజయవాడ వరద బాధితుల కోసం గురు రాజారావు 100 కేజీల బియ్యాన్ని కొంత ఆర్థిక సహాయాన్ని అందించి తన మానవత్వాన్ని చాటుకోవడం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ మా పిలుపునందుకొని ఈరోజు కూడా విజయవాడ వరద బాధితుల కోసం తమ వంతు సహాయ సహకారాలుఅందించినప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇంకనూ అనేకమంది సహాయం చేయడానికి ముందుకు రావాలని మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముత్తు, సామెల్, హనుమంతు, రెడ్డి మొదలగువారు పాల్గొన్నారు..

## నిమజ్జనానికి విస్తృత ఏర్పాట్లు నగరపాలక కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్

విభారే న్యూస్. ఆగస్టు 12. కర్నూల్ ప్రతినిధి.కర్నూలు నగరంలోని ఈ నెల 15వ తేదీన జరిగే గణేష్ నిమజ్జనానికి వినాయక ఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమజ్జనం రోజున ఎటువంటి లోటుపాట్లు లేకుండా పర్యవేక్షించేందుకు 100 మందికి పైగా ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాలు అధికారులు, సచివాలయ సిబ్బందికి విధులు నిర్వహిస్తారన్నారు. పారిశుధ్య పనుల కోసం 270 మంది కార్మికులను నియమించినట్లు వెల్లడించారు. నిమజ్జనానికి నగరపాలక రూ.41.25 లు లక్షలు ఖర్చు చేస్తుందని, అందులో రూ.10 లక్షలతో మైకులు, షామియానాలు, విద్యుత్ దీపాలు, రూ.1.5 లక్షలతో 25 ప్రదేశాలలో సిసి కెమెరాలు, రూ.1 లక్షతో కమాండ్ కంట్రోల్ రూమ్, రూ.1.75 లక్షలతో గజ ఈతగాళ్లు, రూ.15 లక్షలతో 8 క్రేన్లు, రూ.9 లక్షలతో పెయింటింగ్, రూ.3 లక్షలతో 12 ప్రదేశాల్లో తాగునీటి సరఫరాకు నిధులు వెచ్చిస్తున్నామని కమిషనర్ స్పష్టం చేశారు.నిమజ్జన శోభా యాత్రను విజయవంతం చేసేందుకు పోలీసు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామని, నిమజ్జనం రోజున చేపట్టాల్సిన చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇప్పటికే నగరపాలక అధికారులకు, సిబ్బందికి సూచించామని పేర్కొన్నారు. 6 ఘాట్లలో నిమజ్జనం జరుగుతుందని, ప్రతి ఘాట్ వద్ద ఒక క్రేన్ ఉంటుందని, అదనంగా మరో 2 క్రేన్లు అందుబాటులో ఉంటాయన్నారు. ముందు జాగ్రత్తగా మత్స్యకార శాఖ నుండి గజ ఈతగాళ్లను పెట్టామన్నారు. నిమజ్జన శోభాయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసేందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు

# అంగన్వాడీ కేంద్రాలు అందజేసే టేక్ హోం రేషన్ గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా తీసుకోవాలి

**చిన్నారులను దేశానికి ఉపయో గపడే విధంగా తీర్చిదిద్దండి రాష్ట్ర మహిళా ఛైర్మన్ శ్రీమతి గజ్జెల వెంకటలక్ష్మి**

విభారే న్యూస్ కర్నూలు ప్రతినిధి.సెప్టెంబరు, 12 : అంగన్వాడీ కేంద్రాలు అందజేస్తున్న టేక్ హోం రేషన్ ను గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ గజ్జెల వెంకటలక్ష్మి అంగన్వాడీ/సిడిపిఓలకు సూచించారు.గురువారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "7వ రాష్ట్రీయ పోషణ్ మాహ్-2024" అవగాహన కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఛైర్మన్ శ్రీమతి గజ్జెల వెంకట లక్ష్మి, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా ఛైర్మన్ శ్రీమతి గజ్జెల వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రీయ పోషణ్ మాహ్ కార్యక్రమం ద్వారా దేశంలో ఉన్న అనేక మంది మహిళలు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలలో రక్తహీనతను నివారించేందుకు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఎక్కడైతే మహిళల్లో రక్తహీనత, చిన్నారుల్లో ఎదుగుదల లోపాలు, అనీమియా తక్కువ శాతం ఉంటుందో ఉన్న జిల్లాలను గుర్తించి అక్కడ సమావేశాలు నిర్వహించి మహిళలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే టేక్ హోం రేషన్ ను గర్భిణీ స్త్రీలు తింటున్నారా లేదా అని గర్భిణీ స్త్రీలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా, రాజకీయపరంగా, సామాజికంగా వృద్ధి చెందాలన్నారు. గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా టిటి ఇంజెక్షన్ తీసుకోవాలని, అదే విధంగా బాలింతలు చిన్నారులకు తల్లి పాలను అందజేయాలన్నారు. అంగన్వాడీ పాఠశాలకు పిల్లలను ఖచ్చితంగా పంపాలని, గతంలో మహిళ కమిషన్ సభ్యులుగా ఉన్న సమయంలో చాలా అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని అందులో ఉన్న అంగన్వాడీ సిబ్బంది ఎంతో ఓపికగా పిల్లలకు ఆట, పాటలతో పిల్లలకు విద్యను నేర్పించడం జరుగుతుందని, పిల్లలు మొదటగా విద్యను అక్కడి నుంచే అభ్యసించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మహిళలు పని చేసే చోట ఇబ్బందులకు గురికాకుండా ఉండే విధంగా రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను ప్రవేశ పెట్టడం జరుగుతుందన్నారు. పని చేసే చోట ఎటువంటి వేధింపులు గురైన పోష్ యాక్ట్ అనేది అమలులో ఉందని సదరు చట్టాల పై కూడా అవగాహన కల్పిస్తామని, జిల్లాలో కొన్ని శాఖలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పని చేసే చోట వేధింపులు జరుగుతున్నాయని నేరుగా కమిషన్ దృష్టికి తీసుకొని రావడం జరిగిందని, అందుకు జిల్లాలో రాబోయే రోజుల్లో పోష్ యాక్ట్, పని చేసే చోట వేధింపులపై కూడా ఒక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని సదరు సమాచారాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా మహిళా కమిషన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకునేందుకు తగిన సహాయ సహకారాలు అందజేసిన జిల్లా కలెక్టర్ గారికి మహిళా కమిషన్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో "పోషణ్ మాహ్" అనే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఐసిడిఎస్ ప్రాజెక్టును ఎనిమిది భాగాలుగా విభజించి గర్భిణీ స్త్రీలకు, చిన్నారులలో రక్తహీనత లేకుండా ఎదుగుదల లోపం లేకుండా పూర్తి స్థాయిలో పని చేయడం జరుగుతుందన్నారు. అయితే నివేదిక ప్రకారం కోడుమూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు ప్రాజెక్టు పరిధిలో వయస్సు తగ్గ బరువు లేకపోవడం, అనీమియాతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలు కూడా ఈ జిల్లాలో ఎక్కువగానే ఉన్నారని సదరు ప్రాజెక్టుల మీద కూడా సిడిపిఓలు, ఐసిడిఎస్ పిడి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణీ స్త్రీలకు అందించే టేక్ హోం రేషన్ ను వారి కడుపులో ఉన్న చిన్నారులను దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా వారే తీసుకునే విధంగా గర్భిణీ స్త్రీలకు అంగన్వాడీ సిబ్బంది/ఐసిడిఎస్ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా పాఠశాలలో మిడ్ డే మీల్స్ ద్వారా పౌష్ఠిక ఆహారం అందిస్తూ పోషకాహార లోపం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్వాడీ సిబ్బంది/సిడిపిఓలు పాఠశాలలను తనిఖీ చేస్తూ అనీమియాతో బాధపడుతున్న వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందజేయాలన్నారు. ముఖ్యంగా విద్యార్థినిలు స్కూల్ డ్రాప్ ఔట్స్ కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు బాల్య వివాహాలు జరగడం వల్ల చిన్న వయసులో వచ్చే గర్భం పట్ల అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా పని చేసే చోట వేధింపులు గురైతే ఎటువంటి భయాందోళనకు గురికాకుండా సంఘటికంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి జిల్లా యంత్రాంగం వైపు నుంచి కూడా పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఉంటాయన్నారు.సిడబ్ల్యుసి కమిటీ చైర్మన్ జుబేదా బేగం మాట్లాడుతూ బాల్య వివాహాలు చాలా వరకు తగ్గాయని అయితే పూర్తిగా తగ్గలేదని వాటి వల్ల వచ్చే గర్భం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అదే 18సం.ల తరువాత వివాహం అయినట్లయితే ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా జన్మించే అవకాశం వుంటుందని, ఇప్పుడున్న అంగన్వాడీ సిబ్బంది రోజూ గర్భిణీ స్త్రీలను పరిశీలించడం ద్వారా ఆరోగ్యంగా బిడ్డ పుట్టే అవకాశం ఉంటుందని, అదే విధంగా పుట్టిన బిడ్డకు తల్లిపాలు అందజేయడం ద్వారా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రం నుండి అందజేసే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని గర్భిణీ స్త్రీలకు అవగాహన కల్పించాలన్నారు.మహిళ, శిశుసంక్షేమ శాఖ అధికారి వెంకట లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెప్టెంబరు 1వ తేది నుండి సెప్టెంబరు 30వ తేది వరకు పోష మహోత్సవాలను నిర్వహించుకోవడం జరుగుతుందని, అయితే ఈ సంవత్సరం మాత్రం మహిళా కమిషన్ సమన్వయంతో జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అనేది 1975వ సం. నుండి ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో, మహిళల్లో రక్తహీనత, పోషణ ఆహార లోపాన్ని నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గర్భిణీ స్త్రీలల్లో, పాలిచ్చే తల్లులో ఉన్న రక్త హీనతను నివారించడానికి ప్రతి సంవత్సరం ఒక నెల పాటు మండల, జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించి అందరికీ అవగాహన కల్పించడం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 1886 అంగన్వాడీ సెంటర్లు ఉన్నాయని వాటి ద్వారా గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు 40వేల మందికి, చిన్నారులకు సుమారుగా 1లక్ష 7వేల మందికి సేవలు అందిస్తున్నామని ఇందులో 45 వేల ప్రీ స్కూల్లో చిన్నారులు ఉండడం జరిగిందన్నారు. గర్భిణీ స్త్రీలకు ఏ రాష్ట్రంలో లేని విధంగా న్యూట్రిషన్ కిట్ (రాగి పిండి, ఎండు ఖర్జూర, అటుకులు, చిక్కులు) బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు అందజేయడం జరుగుతుందన్నారు. చిన్నారులకు హాట్ కుక్డ్ మీల్ కూడా అన్ని సెంటర్స్ లో అందజేయడం జరుగుతుందన్నారు. వాక్సినేషన్ ప్రోగ్రామ్స్, బాల్య వివాహాలు, గృహ హింస కేసుల పై కూడా అవగాహన కల్పించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిన్నారులు/మహిళలు కూడా ఎవ్వరూ లేని వారు కోసం కూడా వన్ స్టాప్ సెంటర్, స్వాధర్ హోం, మహిళా ప్రాంగణం కూడా నిర్వహిస్తున్నామని వారి ఉపాధి కోసం వారికి వివిధ శిక్షణలు కూడా వారి ఇష్టం మేరకు ఇవ్వడం జరుగుతుందన్నారు.అనంతరం పది మంది గర్భిణీ స్త్రీలకు రాష్ట్ర మహిళ కమిషన్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్, సిడబ్ల్యుసి కమిటీ చైర్మన్ చేతుల మీదుగా సీమంతం నిర్వహించి వారు తీసుకోవాల్సిన పోషకాహారలు, జాగ్రతలపై పలు సూచనలు చేశారు.అంతకుముందు సునయన ఆడిటోరియం ఆవరణంలో చిరుధాన్యాలతో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్ ను రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ పరిశీలించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**